

చీనీ టన్ను రూ.32,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32,500 పలికాయి.



టమాట కిలో రూ.18

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/17.1°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు డీడీగా పని చేస్తున్న ఆయన్ను అనంతపురం డీడీగా నియమిస్తూ ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. నూతన డీడీకి కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

ఎన్‌హెచ్ పనులు పూర్తవ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు డిసెంబరులోపు పూర్తి చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సేకరణలో జాప్యం చేయరాదన్నారు. ఎన్‌హెచ్–67కు సంబంధించి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, భూపరిపాలన విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ లక్ష్యాలను అధిగమించాలి

ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి పథకం అమలుపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి డ్వామా పీడీ, ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఎంలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, లేబర్ బడ్జెట్‌లో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతివారం 20 మంది చొప్పున ఎస్సీ, ఎస్టీ సభ్యులకు పనులు కల్పించాలన్నారు. ఉపాధి కింద మంజూరైన పనులన్నీ ఈ నెల 16లోగా మొదలవ్వాలన్నారు. అమృత్ కింద నగర పాలక, పురపాలక సంస్థల్లో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.

అరకొర నిధులు.. అంకెల గారడీతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసింది. సోమవారం అసెంబ్లీలో రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా... ఏ రంగానికీ పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేకపోయింది. రైతులు, నిరుద్యోగులు, మహిళలు..ఇలా ఏ వర్గానికీ సాయంగా నిలవలేకపోయింది. అందుకే అందరూ.. ‘అంతన్నాడు.. ఇంతన్నాడే చంద్రబాబు..’ అంటూ పాడుకుంటున్నారు.

- బడ్జెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు మొండిచేయి
- పరిశ్రమల ఊసు లేదు.. కొత్త పెట్టుబడులూ లేవు
- నిరుద్యోగ భృతి.. అంతా భ్రాంతి
- వ్యవ ‘సాయం’ లేని కూటమి బడ్జెట్
- మహిళపై మమకారం చూపని పాలకులు
- సాగునీటి రంగానికీ అరకొర నిధులు
- సొంత జిల్లాపై కరుణ చూపని ఆర్థిక మంత్రి కేశవ్
- కూటమి బడ్జెట్‌పై అన్ని వర్గాలూ పెదవివిరుపు

నిధులు కల్ల.. కేటాయింపు డొల్ల!



అనంతపురం: అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ తొలి బడ్జెట్‌లోనూ అంకెల గారడీ చేసింది. ఏ వర్గానికీ న్యాయం చేయలేకపోయింది. చివరకు సూపర్ సిక్స్ అంటూ గొప్పలు చెప్పిన పథకాలనూ విస్మరించడంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తన సొంత జిల్లా అనంతపురంపైనా మమకారం చూపలేకపోయారు. ఉచిత పంటల బీమాకు మంగళం పాడారు. జిల్లాకు జీవనాడి హెచ్చెల్సీకి అత్తెసరు నిధులు కేటాయించడంతో రైతన్న అన్యాయమై పోయాడు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులకు కూడా పెద్దగా నిధులు కేటాయించలేదు. నిరుద్యోగ భృతి భ్రాంతిగానే మిగిలింది. దీంతో కూటమి సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చూసి ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులంతా పెదవి విరుస్తున్నారు.

హెచ్చెల్సీకి మొండిచేయి

జిల్లాలో ప్రధానమైన హెచ్చెల్సీకి బడ్జెట్‌లో మొండిచేయి చూపారు. హెచ్చెల్సీ స్టేజ్– 1 కింద రూ.108 కోట్లు, స్టేజ్–2 కింద రూ.684 కోట్లకు ప్రతిపాదనలు చేశారు. అయితే రాష్ట్ర బడ్జెట్‌లో హెచ్చెల్సీ స్టేజ్–1కు రూ.2 కోట్లు, స్టేజ్–2కు రూ.26.2 కోట్లు.. మొత్తంగా రూ.28.2 కోట్లు మాత్రమే కేటాయించి రైతన్నలకు అన్యాయం చేశారు. హంద్రీ–నీవాకు కూడా రూ.867.75 కోట్లు మాత్రమే కేటాయించారు. హంద్రీ–నీవా కాలువ వెడల్పునకు రూ.6,700 కోట్లు కావాలని ప్రతిపాదనలు చేయగా, కేవలం రూ.867.75 కోట్లు కేటాయించారు. ఇక తుంగభద్ర దిగువ కాలువ (ఎల్‌ఎల్‌సీ)కు రూ.90 కోట్లు ప్రతిపాదన చేయగా, రూ.13 కోట్ల అత్తెసరు నిధులు కేటాయించారు. జిల్లా అభివృద్ధికి నిధులు, హామీల అమలు గురించి స్పష్టత లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఎప్పటి నుంచి అమలు చేస్తుందో బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం ప్రజలను నిరాశకు గురిచేసింది.

అన్నదాతకు నిరాశ

వ్యవసాయ– అనుబంధ రంగాలు, రైతు సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఏ మూలకూ చాలవని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. కేటాయించిన నిధులు కూడా పూర్తి స్థాయిలో విడుదల చేసే పరిస్థితి లేదని అంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లు మార్చిన కూటమి ప్రభుత్వం ..ఇప్పుడు బడ్జెట్‌లో అరకొరగా కేటాయింపులు చేసింది. ఇక జిల్లా రైతులకు ఉపయోగపడేలా కొత్తగా ఎలాంటి కేటాయింపులూ చేయలేకపోయింది. గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా కింద పరిహారం ఊసే ఎత్తలేదు. కొత్తగా అమలు చేస్తున్న పంటల బీమా పథకాలకు రైతులపై ప్రీమియం భారం మోపింది. ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే తప్ప బీమా పథకం వర్తించే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం అమలు చేసిన సున్నా వడ్డీ పంట రుణాలు, పావలా వడ్డీ పథకాలకు కేటాయించిన బడ్జెట్ చాలదంటున్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు సర్కారు... ఇప్పుడు పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ.20 వేలు ఇస్తామంటోంది. అయితే అందుకు కేటాయించిన బడ్జెట్ కూడా చాలదని చెబుతున్నారు. దీంతో ఒక్క అనంతపురం జిల్లాలోనే 5.70 లక్షల మంది రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

భృతి..భ్రాంతి

ఇంటికోద్యోగం.. లేదంటే రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. బడ్జెట్ కేటాయింపుల్లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 4.84 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. వారంతా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి భృతి ఇస్తారని వేయి కళ్లతో ఎదురుచూసినా చివరకు నిరాశ తప్పలేదు.

మహిళలకు మొండిచేయి

మహిళలకు ఈ బడ్జెట్‌లో మొండిచేయి చూపారు. ఉచిత బస్సు ప్రయాణమంటూ ఊరించినా బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదు. ఇక 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ ఏడాదికి రూ.1,500 ఇస్తామన్న హామీని కూడా పూర్తిగా విస్మరించారు. తల్లికి వందనానికి రూ.10 వేల కోట్లకుపైగా అవసరముండగా, కేవలం రూ.2,491 కోట్లే కేటాయించారు. అంటే 25 శాతం మందికి కూడా ఈ పథకం అందే అవకాశం లేదు.

‘సూపర్’ మోసం



చంద్రబాబు ఎన్నికల ముందు ఏ విధంగా సూపర్‌సిక్స్ పేరిట ప్రజలను మోసం చేశారో.. అదే తరహాలో బడ్జెట్‌లోనూ బురిడీ కొట్టించారు. ‘అన్నదాత సుఖీభవ’ కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొని..బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేశారు. ఈ పథకానికి రూ.10 వేల కోట్లకు పైగా అవసరం కాగా.. రూ.4,500 కోట్లు మాత్రమే కేటాయించి రైతాంగాన్ని మోసగించారు. ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల భృతి ఇస్తామని పంగనామాలు పెట్టారు. ఆడబిడ్డ నిధి కింద 19 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామన్నా..బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదు. ‘తల్లికి వందనం’కు కేటాయించిన రూ.2,491 కోట్లు ఏమూలకు సరిపోతాయి? ఈ పథకానికి రూ.10 వేల కోట్లకుపైగా అవసరం. అయినా బడ్జెట్‌పై కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాలకు నిరాశ



ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో కనీస ప్రస్తావన చేయలేదు. బడ్జెట్ పూర్తిగా రాజకీయ పత్రంగా ఉంది. ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయం. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతన పెంపు గురించి ప్రస్తావన లేదు. ప్రీమియం చెల్లిస్తేనే ఉచిత పంటల బీమా పథకం వర్తింపజేస్తామనడం దుర్మార్గం. కార్మికుల సంక్షేమం మాటే ఎత్తకపోవడం శోచనీయం. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లను ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు చేసిన సంగతి దాచి పెట్టడం అన్యాయం.

– వి. రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

మసిపూసి మారేడు కాయ చేశారు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావన లేదు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు లేవు. అభివృద్ధికి కేటాయించిన నిధులు కూడా అమరావతికి మళ్లిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఊసే లేదు. పిల్లలకు గోరుముద్ద లేదు. మసి పూసి మారేడు కాయలాగా బడ్జెట్ ఉంది. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్‌లో రెవెన్యూ లోటు రూ.80 వేల కోట్లు ఉంది. దీనిని ఏ విధంగా భర్తీ చేస్తారు? ఇది పూర్తిగా పయ్యావుల పైపై బడ్జెట్ మాత్రమే.

– కేవీ రమణ, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

దగా పడ్డ రైతాంగం



రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చారు. కానీ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధితో కలిపి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గం. రాయలసీమ ప్రాంతంలో పంట పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామన్న హామీని విస్మరించారు. హెచ్చెల్సీ లైనింగ్ పూర్తి, హంద్రీనీవా కాలువ వెడల్పునకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకుండా రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం దగా చేసింది.

– ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కన్న కొడుకు అన్నం పెట్టడం లేదు

- ‘అడుక్కు తిను’ అంటూ చీదరించుకుంటున్నాడు
- కలెక్టర్ వినోద్ కుమార్ ఎదుట 84 ఏళ్ల వృద్ధుడి ఆవేదన
- పింఛన్ ఇప్పించాలని వేడుకోలు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 427 వినతులు



ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరిస్తూ సమస్యలు వింటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: వృద్ధాప్యంలో తనను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న కొడుకే పట్టించుకోవడం లేదని కూడేరు మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన 84 ఏళ్ల కె.ఓబుళప్ప ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘ప్రజాసమస్యల పరిష్కార వేదిక’లో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తనకు ఒక కుమారుడు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారన్నారు. తన పదెకరాల పొలాన్ని కుమారుడు సాగు చేసుకుంటున్నాడని తెలిపారు. వయసు పైబడిన తన బాగోగులు చూడటం లేదని వాపోయారు. కనీసం అన్నం కూడా పెట్టడం లేదని, అడుక్కు తినుపో అంటూ చీదరించుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లవీళ్లు పెట్టింది తిని బతుకుతున్నానని చెప్పారు. పింఛను ఇప్పించి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

427 వినతులు..

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, డీపీఓ నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 427 వినతులు అందాయి. నిర్లక్ష్యం చేయకుండా ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు ప్రజల వద్దకే కలెక్టర్ వెళ్లి అర్జీలను స్వీకరించారు. అర్జీలు రాయించుకునే ప్రదేశంలో కూర్చునేందుకూ వీలు లేక దివ్యాంగులు, వృద్ధులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన.. సంబంధిత అధికారిని పిలిచి మాట్లాడారు. వచ్చే సోమవారం నాటికి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించి తగిన వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- పీఏబీఆర్ కుడి కాలువకు నీరిచ్చి రైతులను ఆదుకోవాలని జిల్లా పండ్ల తోటల రైతు సంఘం అధ్యక్షుడు అనంతరాముడు, తదితరులు విన్నవించారు. హంద్రీ–నీవా నీటిని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పీఏబీఆర్‌కు మళ్లించి కుడికాలువ కింద ఉన్న ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం, ధర్మవరం నియోజకవర్గాల్లోని చెరువులకు వదలాలని కోరారు.
- భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా వీఆర్‌ఓ ఇబ్బంది పెడుతున్నాడని శింగనమల మండలం రాచేపల్లికి చెందిన ఆదెన్న ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 175–2లో 14 సెంట్లు, సర్వే నెంబరు 179లో 32 సెంట్లు భూమి ఉందని, ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

నివేదికలు సిద్ధం చేయండి

ప్రగతి నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఈ నెలాఖరులో ఉంటుందన్నారు. నిర్దేశించిన అంశాలకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోజుకు మూడు నాలుగు శాఖల సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో పథకాల అమలు తీరు, రాష్ట్రంలో ఏ స్థాయిలో ఉందనే వివరాలతో నోట్ అందించాలన్నారు.

పుణ్యక్షేత్రాల సందర్శనలో పుత్రశోకం

- మహానంది కోనేరులో పడి బాలుడి మృతి



చక్రధర రెడ్డి (ఫైల్)

మహానంది/పుట్లూరు: కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాల సందర్శనకు బయలుదేరిన ఓ కుటుంబంలో విషాదం అలుముకుంది. నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలోని కోనేరులో ప్రమాదవశాత్తు ఓ బాలుడు పడి మృతి చెందాడు. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు...అనంతపురం జిల్లా పుట్లూరు మండలం శనగల గూడూరు గ్రామానికి చెందిన హరికుమార్‌రెడ్డి, నాగజ్యోతి దంపతులు కుమారులు చక్రధర్ రెడ్డి(9), విఘ్నేశ్వర్‌రెడ్డితో కలిసి ఆదివారం యాగంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి సోమవారం ఉదయం మహానందికి వచ్చారు. చిన్నకోనేరు వద్ద స్నానాలు ఆచరించేందుకు వెళ్లగా.. హరికుమార్‌రెడ్డి బాత్‌రూమ్‌కు వెళ్తూ పిల్లలను భార్య వద్ద ఉంచి వెళ్లాడు. అయితే పెద్దకుమారుడు చక్రధర్‌రెడ్డి కాలుజారి నీళ్లల్లో పడ్డాడు. భక్తులు కాపాడి బయటకు తీసేలోపు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే వైద్య శిబిరం వద్ద ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా..అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌పీసీఐ యాక్టివేషన్ కోసం పోస్టాఫీసుల్లో ప్రత్యేక శిబిరాలు

అనంతపురం సిటీ: ఎన్‌పీసీఐ యాక్టివేషన్, ఐపీపీబీ ఖాతాల కోసం పోస్టాఫీసుల్లో ఈ నెల 15 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అనంతపురం హెడ్ పోస్ట్‌మాస్టర్ జి.భానుకుమార్ తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే సామాజిక ప్రయోజనాలు పొందేందుకు పై సర్వీసులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. చాలామంది నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో ఆధార్ అనుసంధానం చేసుకోకపోవడంతో డీబీటీ ద్వారా ప్రయోజనాలు అందుకోలేకపోతున్నారని తెలిపారు. అలాంటి వారందరూ దగ్గరలోని పోస్టాఫీసులకు వెళ్లి ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని సూచించారు.

ఆదర్శప్రాయులు ఆజాద్

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మౌలానా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య



ఉత్తమ ఉర్దూ టీచర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: భారతరత్న అబుల్ కలామ్ ఆజాద్ ఆదర్శప్రాయులని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. సోమవారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని టవర్‌క్లాక్ సమీపంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ డీపీఆర్‌సీ భవన్‌లో నిర్వహించిన ఆజాద్ జయంతి సభకు వారు హాజరై మాట్లాడారు. దేశానికి తొలి విద్యా శాఖ మంత్రి హోదాలో ఆజాద్ తీసుకొచ్చిన సంస్కరణలు ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపాయని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. మైనారిటీ బాలికలు చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. తమ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించడం గర్వంగా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ పాల్గొన్నారు.

అంతా ఇష్టారాజ్యం..

అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని అధికారులు ఇష్టారాజ్యంగా నిర్వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొటోకాల్ లేకుండా ఎవరిని పడితే వారిని ఆహ్వానించడం చర్చనీయాంశమైంది. జెడ్పీలో ఏర్పాటు చేసిన సభలో అర్హత లేకపోయినా కొందరిని వేదికపైకి ఆహ్వానించి మైనారిటీ సంక్షేమశాఖ అధికారి రామసుబ్బారెడ్డి స్వామి భక్తి చాటుకున్నారు. ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకుని చెలామణి అవుతున్న షకీల్‌షఫీకి ఏకంగా కలెక్టర్ పక్కనే సీటు ఏర్పాటు చేయడంపై మత పెద్దలు, ముస్లింలు అసంతృప్తి వ్యక్తం చేశారు. మైనారిటీల సంక్షేమానికి పాటుపడిన వారిని పిలిచి సన్మానించకుండా.. తనకు అనుకూలమైన వారిని పిలిచి శాలువలు, పూలమాలలతో సత్కరించడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. అంతే కాకుండా తనకు నచ్చిన వారికి మైకులు ఇచ్చి మాట్లాడాల్సిందిగా కోరడం అందరినీ విస్మయానికి గురి చేసింది.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఓ లారీ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటన సోమవారం తెల్లవారుజామున ఉరవకొండ పరిధిలోని బూదగవి దగ్గర జాతీయ రహదారి 42పై చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. అనంతపురం నుంచి బళ్లారి వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ అశోక్ లారీ ఆపి బయటకు దూకేశాడు. అనంతరం స్థానికుల సహాయంతో అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలు అదుపు చేశారు. మంటలు వేగంగా వ్యాపించడంతో లారీ క్యాబెన్‌తో పాటు 80 శాతం కాలిపోయింది. రూ.15 లక్షల వరకూ నష్టం జరిగినట్లు లారీ ఓనర్ నందకిషోర్ తెలిపారు.

చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ పక్కాగా జరగాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ శివనారాయణశర్మ, అధికారులు

అనంతపురం అర్బన్: అంగన్‌వాడీ సిబ్బంది తమ కేంద్రాల్లోని పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్ పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌పై సమన్వయ సమావేశం నిర్వహించడంతో పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆరోగ్యశాఖతో అంగన్‌వాడీ, పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రతి విద్యార్థికి హెల్త్ కార్డులో హెల్త్ ప్రొఫైల్ తయారు చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ మలోల, ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.ఎస్.వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

పేరుకే ఉద్యాన హబ్

- 3 లక్షల ఎకరాల్లో 72 రకాల ఉద్యాన పంటల సాగు
- డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి కూడా లేని దుస్థితి
- సస్యరక్షణపై రైతులకు సలహాలిచ్చే వారు కరువు



ఉద్యానశాఖ కార్యాలయం

అనంతపురం అగ్రికల్చర్: పదిహేను సంవత్సరాల కిందటే ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీగా అనంతపురం జిల్లా పేరు సంపాదించింది. ఇపుడు ఉద్యానహబ్‌గా పిలుస్తున్నారు. జిల్లాల విభజన జరిగినా... ఇప్పటికీ అనంతపురం జిల్లానే ఉద్యాన తోటల విస్తీర్ణంలో మొదటి స్థానంలో ఉంది. యాపిల్ లాంటి రెండు మూడు రకాలు మినహా మిగతా అన్ని రకాల ఉద్యాన తోటలకు నెలవుగా మారింది. జిల్లా నుంచి చీనీ, అరటి, దానిమ్మ, టమాట, గులాబీ తదితర ఉత్పత్తులు ఉత్తరాది రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీలో పేరున్న అజాద్‌పూర్ మండీలో 'అనంత' ఉద్యాన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. వేలాది మంది ఉద్యాన రైతులు, లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు, రూ.వేల కోట్ల టర్నోవర్ పరంగా జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోంది. కానీ... ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) స్థాయి జిల్లా అధికారి లేకపోవడం గమనార్హం. అతి తక్కువ ఉద్యానతోటల విస్తీర్ణం కలిగిన కొన్ని జిల్లాల్లో డీడీ స్థాయి అధికారులు పనిచేస్తున్నారు. ఇక్కడ మాత్రం జిల్లా స్థాయి అధికారి లేకపోవడం దురదృష్టకరం.

ఏడీ స్థాయి అధికారే దిక్కు

జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లోనూ పండ్లతోటలు విస్తరించాయి. తాజా నివేదికల ప్రకారం 3 లక్షల ఎకరాల్లో తోటలు సాగు చేస్తున్నారు. అందులో 1.80 లక్షల ఎకరాల్లో పండ్లతోటలు, 55 వేల ఎకరాల్లో కూరగాయ పంటలు, 40 వేల ఎకరాల్లో సుగంధం, ఔషధ పంటలు, పూలతోటలు తదితర సాగులో ఉన్నాయి. 72 రకాల ఉద్యాన తోటలు సాగులో ఉండగా ఏటా 38 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఫలసాయం వస్తోంది. ఇలాంటి జిల్లాలో తరచూ వర్షాభావం, ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పు కారణంగా చీడపీడలు, తెగుళ్ల బెడద కూడా అధికంగా ఉంటోంది. మార్కెటింగ్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇలాంటి పరిస్థితి ఉన్నందున కచ్చితంగా జిల్లాస్థాయి (డీడీ) అధికారి ఉండాల్సిన చోట... ఏడీ స్థాయి అధికారితో నెట్టుకొస్తున్నారు. ఇక్కడికి రెగ్యులర్ డీడీని నియమించినా.. బాధ్యత తీసుకున్న రోజే డిప్యుటేషన్ మీద కమిషనరేట్‌లో పనిచేస్తున్నారు. దీంతో ఏడీ బీఎంవీ నరసింహారావుకే ఇన్‌చార్జ్ డీడీ బాధ్యతలు అప్పజెప్పారు. టెలీ కాన్ఫరెన్స్‌లు, జూమ్ మీటింగ్, కలెక్టరేట్ సమీక్షలకు హాజరయ్యేందుకే ఏడీకి సమయం చాలడం లేదని చెబుతున్నారు. ఏడీతో పాటు మరో 10 మంది హెచ్‌ఓలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా... పండ్లతోటల విస్తీర్ణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం సాధ్యం కావడం లేదని తెలుస్తోంది. ఇటీవల కాలంలో రైతులు ఉద్యానశాఖ కార్యాలయానికి రావడం మరచిపోయారు. సస్యరక్షణ సిఫారసులు, సాంకేతిక సలహాలు, పథకాల సమాచారం ఇచ్చేవారు లేకపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారిందని చెబుతున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ డీడీ జిల్లాలో పనిచేసేలా చర్యలు తీసుకోకపోతే ముస్ముందు మరిన్ని సమస్యలు తప్పవని రైతులు ఆవేదన చెందుతున్నారు.

'అబుల్ కలాం'కు ఘన నివాళి



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు

- ప్రతి ఒక్కరూ ఆజాద్ బాటలో నడవాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'స్వాతంత్య్రం కోసం భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ పదేళ్లపాటు జైలు జీవితం అనుభవించారు. స్వాతంత్య్రం వచ్చాక భారత తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగంలో అనే విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కృషి చేశారు. అబుల్ కలాం ఆజాద్ ఆదర్శప్రాయుడు' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. సోమవారం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు,ఐఐటీలు, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఉన్నాయంటే మౌలానా అబుల్ కలాం ఆజాద్ మేధా సంపత్తి వల్లే సాధ్యపడిందన్నారు.

మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్

మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్ఫూర్తితో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో మైనార్టీలకు ఉన్నత విద్యతో పాటు ఉన్నత స్థాయికి చేరేందుకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత పేర్కొన్నారు. ప్రధాని మోదీ మతతత్వ ధోరణితో ముందుకెళ్తున్నారని, లౌకికవాదం వైపు అడుగులు వేసి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కార్పొరేటర్ రహంతుల్లా, నాయకులు పామిడి వీరాంజినేయులు, రాధా, మీసాల రంగన్న, బాకే హబీబుల్లా, ఫయాజ్, అమర్‌నాథ్‌రెడ్డి, సాదిక్, వేమల నదీం, రియాజ్, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట మధు, భారతి, రాధాయాదవ్ పాల్గొన్నారు.

చిరుత, ఎలుగు మృతి





మృతి చెందిన చిరుత, ఎలుగు బంటి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

మడకశిర రూరల్/రొళ్ల: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో చిరుత, ఎలుగుబంటి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాయి. వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగాయి. మడకశిర మండలం మధుగిరి రోడ్డులోని రెండు కొండల మధ్య ప్రధాన రహదారి పక్కన ఏడాది వయసున్న ఆడ చిరుత సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. అటుగా వెళ్తున్న వారు ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ విషయం అటవీ శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, సబ్ డీఎఫ్‌ఓ ఆనంద్, స్థానిక అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప, వెటర్నరీ ఏడీ అమర్‌నాథ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని..చిరుత కళేబరాన్ని పరిశీలించారు. రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉండొచ్చని డీఎఫ్‌ఓ చక్రపాణి తెలిపారు. చిరుత కళేబరానికి పోస్టుమార్టం చేసిన అనంతరం దహనం చేశారు.

వక్కతోటలో ఎలుగు...

రొళ్ల మండలం బాజయ్యపాళ్యం–కురుబరహట్టి గ్రామాల సమీపంలో వక్కతోటలో సుమారు 15 ఏళ్ల వయసున్న ఎలుగుబంటి మృతిచెందింది. ఇది ఆదివారం సాయంత్రం ఆహారం కోసం గ్రామాల్లోకి రావడంతో ప్రజలు పరుగులు తీశారు. ఈ క్రమంలో నాగరాజు అనే రైతుపై దాడి చేసి గాయపరిచింది. అనంతరం ప్రజలు పెద్దఎత్తున శబ్దాలు చేయడంతో ఎలుగు బంటి సమీపంలోని వక్కతోటలోకి వెళ్లి దాక్కుంది. కొండ ప్రాంతానికి తరలించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నించినా.. ఎటూ కదలకుండా తోటలోనే ఉండిపోయింది. సోమవారం తెల్లారేసరికల్లా మృతి చెంది ఉండటాన్ని గ్రామస్తులు గమనించి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. డీఎఫ్‌ఓ చక్రపాణి, స్థానిక అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం తర్వాత ఎలుగుబంటి కళేబరాన్ని దహనం చేశారు. ఎక్కువసేపు పరుగెత్తడం వల్ల ఊపిరాడక మృతి చెంది ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు.

రైలు కింద పడి 18 గొర్రెలు మృతి

గార్లదిన్నె: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రైలు కింద పడి 18 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల వివరాలు మేరకు .. గొర్రెల కాపర్లు రైల్వేస్టేషన్ సమీపంలో వ్యవసాయ పొలాల్లో గొర్రెలు మంద మేపు తుండగా కొన్ని గొర్రెలు రైల్వే ట్రాక్ సమీపంలోకి వెళ్లాయి. అదే సమయంలో గుంతకల్లు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో గొర్రెలు చనిపోయాయన్నారు. రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

గార్లదిన్నె: మండల పరిధిలోని యర్రగుంట్లలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాలు మేరకు .. యర్రగుంటకు చెందిన మేహరున్ని (63) అనే మహిళ కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటోంది. నయం కాకపోవడంతో మదన పడుతూ ఉండేదన్నారు. ఈక్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూపర్ వాస్మాయిల్ తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉండగా వెంటనే కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త జాఫర్ సాబ్, కొడుకు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


జూదరుల అరెస్టు

- రూ.4.45 లక్షల స్వాధీనం

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు సమీపంలోని సపోట తోటలో సోమవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4.45 లక్షలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు ఎస్‌ఐ ధరణిబాబు, సిబ్బందితో కలిసి దాడులు జరిపారన్నారు. తాడిపత్రి పట్టణానికి చెందిన శివదత్తా, సోమశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు, షేక్ రహీంబాషా, హనుమంతురెడ్డి, రామనాథరెడ్డిలను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశామన్నారు.

హిజ్రాల మధ్య వార్

- పామిడి హిజ్రాలపై అనంతపురం హిజ్రాల ముఠా దాడి
- రూ.15 లక్షల నగదు, బంగారం దోచుకెళ్లిన వైనం



ఇంట్లోని బట్టలు, వస్తువులను చిందర వందర చేసిన దృశ్యం

పామిడి: పట్టణ నాగిరెడ్డికాలనీలో హిజ్రా చామంతి స్వగృహంపై ఆదివారం అర్ధరాత్రి అనంతపురానికి చెందిన హిజ్రాలు మయూరి, ఆసిఫ్ ఆధ్వర్యంలోని ముఠా దాడి చేసి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. బాధిత హిజ్రా చామంతి వివరాలమేరకు.. తాను నిర్మించుకున్న స్వగృహంలో మరో 7 మంది హిజ్రాలతో కలిసి నివసిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్ధరాత్రి ప్రాంతంలో మయూరి, ఆసిఫ్ హిజ్రాల ఆధ్వర్యంలో హిజ్రా బృందం నాలుగు ఆటోల్లో తప్పతాగి రౌడీలతో కలిసి వచ్చి దాడికి పాల్పడ్డారన్నారు. 50 మంది దాకా ఇంట్లో దూరి ఇళ్లంతా చెల్లా చెదరు చేశారని తెలిపారు. పామిడిలో యాచించగా వచ్చిన డబ్బులో తమకు సగం వాటా ఇవ్వాలంటూ దాడికి పాల్పడ్డారన్నారు. బీరువా పగులగొట్టి సర్జరీ కోసం దాచుకున్న రూ.15 లక్షలతో పాటు దాదాపు 350 గ్రాముల బంగారం, 1000 గ్రాముల వెండి ఆభరణాలు దోచుకెళ్లారన్నారు. విషయం తెలుసుకున్న సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. హిజ్రా బృందానికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు. చామంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జనవరిలో టీసీసీ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్‌లలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు జనవరిలో ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి పాసైన అభ్యర్థులు లోయర్ గ్రేడ్ పరీక్ష రాసేందుకు, లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్ష, అందుకు సమానమైన పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హయ్యర్ గ్రేడ్ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. www.bse.ap. gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డ్రాయింగ్ లోయర్‌కు రూ.100, హయ్యర్‌కు రూ.150, టైలరింగ్ లోయర్‌కు రూ. 150, టైలరింగ్ హయ్యర్ కోర్సుకు రూ. 200 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు ఫారంతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లపై అటెస్టేషన్ చేయించి డిసెంబర్ 13లోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని వారు సూచించారు. ఏపీ కాకుండా ఇతర రాష్ట్రాలు, బోర్డులు జారీ చేసిన ఉత్తీర్ణత సర్టిఫికెట్లు కల్గి ఉన్న అభ్యర్థులు లోయర్, హయ్యర్ గ్రేడ్ టీసీసీ పరీక్షలు రాసేందుకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఏపీ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

పెట్రోల్ బాటిల్‌తో వివాహిత హల్‌చల్

- భర్త తనను వదిలించుకునేందుకు యత్నిస్తున్నాడని ఆవేదన
- ఆత్మహత్యకు యత్నిస్తుండగా అడ్డుకున్న పోలీసులు



కళ్యాణదుర్గం డీఎస్పీ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోలు పోసుకుంటున్న మహిళను అడ్డుకుంటున్న పోలీసు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రేమించి పెళ్లి చేసుకున్న తర్వాత భర్త తనను వదిలించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. తనకు న్యాయం జరగడం లేదంటూ వివాహిత కళ్యాణదుర్గం డీఎస్పీ కార్యాలయం ఎదుట పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. పోలీసులు స్పందించడంతో ప్రమాదం తప్పింది. వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

అసలేం జరిగిందంటే...

బాధితురాలు ఇటీవల ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన వివరాల మేరకు... కంబదూరు మండలం వెంకటాంపల్లికి చెందిన కె.మహేష్ అదే మండలం చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ టీచరుగా పని చేస్తున్నాడు. మరో మతానికి చెందిన యువతిని ప్రేమించాడు. 2023 ఆగస్టు 20న పెళ్లి చేసుకున్నాడు. కళ్యాణదుర్గంలో ఇల్లు అద్దెకు తీసుకుని సంసారం పెట్టాడు. కొంతకాలానికి మహేష్ సోదరుడు, ఆయన భార్య ఇందు, ఆడపడుచు గంగమ్మ, ఆమె భర్త నుంచి ఆ యువతికి వేధింపులు ప్రారంభమయ్యాయి. భార్య క్యారెక్టర్ గురించి భర్తకు చెడుగా చెబుతూ వారిమధ్య చిచ్చు పెడుతూ వచ్చారు. ఈ క్రమంలో గర్భం దాల్చిన మహేష్ భార్యకు గర్భస్రావం అయ్యేలా చేశారు.

అనుమానం వచ్చి నిలదీయగా...

అనుమానం వచ్చి మహేష్‌ను ఆ యువతి నిలదీయగా అసలు విషయం చెప్పాడు. నిన్ను పెళ్లి చేసుకోవడం తన ఇంట్లో వారికి ఇష్టం లేదని అందుకే ఇలా చేశానని చెప్పుకొచ్చాడు. నిన్ను వదిలించుకున్న తర్వాత మరో వివాహం చేస్తామని మా బంధువులు చెబుతున్నారని పేర్కొన్నాడు. ఈ క్రమంలో గత నెల 24న ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లిన భర్త మహేష్ ఇంటికి తిరిగిరాలేదు. భార్య ఫోన్ చేసి ఆరా తీయగా... నన్ను వదిలిపెడితే రూ. 10 లక్షల నష్టపరిహారం ఇస్తానంటూ చెప్పాడు. విషయం బయటకు చెబితే చంపేస్తామని బెదిరించాడు. తనను ప్రేమించి పెళ్లి చేసుకుని చివరకు మోసం చేయడంతో పాటు కడుపులో పెరుగుతున్న బిడ్డ చనిపోవడానికి కారణమైన భర్త, వారి బంధువులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు డిమాండ్ చేస్తోంది. ఇటీవల అనంతపురంలో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన బాధితురాలు...ఎస్పీ ఆదేశాలతో కళ్యాణదుర్గం స్టేషన్‌కు సిఫార్సు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీని కలిసేందుకు వెళ్లిన బాధితురాలు తనకు అన్యాయం చేస్తున్నారంటూ పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇదిలా ఉండగా తాను ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్నది వాస్తవమేనని, అయితే ఆ అమ్మాయికి ముందే పెళ్లైందని టీచర్ మహేష్ తెలిపారు. ఆమె గర్భమే రాలేదని, తాను చంపుతానని ఎప్పుడూ అనలేదన్నారు.

బదిలీల కోసం ఎదురుచూపు

- ప్రభుత్వ తీరుపై వ్యవసాయశాఖ అధికారుల గుర్రు



అనంతపురం అగ్రికల్చర్: బదిలీల ఉత్తర్వుల కోసం వ్యవసాయశాఖ అధికారులు ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో ఆ శాఖకు చెందిన జేడీఏ స్థాయి నుంచి ఏడీఏ, ఏఓ, ఏఈఓల ఆశలు అడియాశలవుతున్నాయి. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు కొలువుతీరిన తర్వాత ఇటీవల చాలా ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో బదిలీలు జరిగాయి. అయితే వ్యవసాయ, అనుబంధ శాఖలకు మాత్రం వెసులుబాటు లభించలేదు. ఖరీఫ్ సీజన్‌లో ఈ–క్రాప్, ఈ–కేవైసీ లాంటి కార్యక్రమాలు ఉండటంతో వాయిదా వేశారు. ఖరీఫ్ ముగిసిన తర్వాత అక్టోబర్ లేదా నవంబర్‌లో బదిలీ ప్రక్రియ ఉంటుందనే ఆశతో వ్యవసాయశాఖ కార్యక్రమాలు విజయవంతంగా ముగించారు. అయితే అక్టోబర్ ముగిసి నవంబర్ వచ్చినా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖలో చాలా మంది కర్నూలు, వైఎస్సార్ కడప, చిత్తూరు తదితర జిల్లాలకు చెందిన వారు ఇక్కడ పనిచేస్తున్నారు. బదిలీలు వస్తే స్వంత జిల్లాలకు వెళ్లాలనే ఆశతో ఉన్నారు. జేడీఏతో పాటు పలువురు ఏడీఏలు, ఏఓలు చాలా మంది బదిలీ ఉత్తర్వులు వస్తే కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి స్థానాలు సిద్ధం చేసుకుని ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం బదిలీ ప్రక్రియ చేపట్టే పరిస్థితి లేకపోవడంతో వచ్చే ఏడాది వరకూ ఎదురు చూడాల్సివచ్చేలా ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్‌శాఖల్లో ఇదే పరిస్థితి ఉండటంతో వారంతా సర్కారుపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు డెప్యుటేషన్ల కింద వెళ్లడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వ్యవసాయ, అనుబంధ శాఖల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతుడు మన్నల సుబ్బరాయుడు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాచానపల్లి ఉప సర్పంచ్ మన్నల వరలక్ష్మి మామ (భర్త తండ్రి) మన్నల సుబ్బరాయుడు (69) మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మన్నల సుబ్బరాయుడు ఉదయాన్నే క్షవరం చేయించుకునేందుకని రూట్స్ పబ్లిక్ స్కూల్ సమీపంలోని షేవింగ్ షెలూన్‌కు వచ్చాడు. అనంతరం యూటర్న్ వద్ద రోడ్డు దాటుకుంటుండగా ద్విచక్ర వాహనం (ఏపీ39 ఎంఎన్ 6227) ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు 'సాత్విక్'



రామగిరి: జాతీయ స్థాయి హాకీ పోటీలకు కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సాత్విక్ ఎంపికైనట్లు సోమవారం ఆ పాఠశాల పీడీ నగేష్‌బాబు తెలిపారు. ఈ నెల 8, 9, 10తేదీల్లో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీల్లో సాత్విక్ ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. వచ్చేనెల మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. హెచ్‌ఎం అనంతపద్మనాభంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇద్దరు విద్యార్థుల మిస్సింగ్



శివరుద్ర, శివ (ఫైల్)

రాయదుర్గం టౌన్: చదవడం ఇష్టం లేక ఇద్దరు విద్యార్థులు ఇంటి వెళ్లిపోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. సీఐ జయనాయక్ వివరాల మేరకు.. పట్టణంలోని కళ్లీమఠం మున్సిపల్ హైస్కూల్ 8వ తరగతి చదువుతున్న శివరుద్ర, శివరామచంద్ర సోమవారం మధ్యాహ్నం భోజనం తర్వాత వెళ్లిపోయినట్లు చెప్పారు. బ్యాగులో బట్టలు కూడా పెట్టుకుని వెళ్లినట్లు తల్లిదండ్రులు తిప్పేస్వామి, శ్రీధర్ చెప్పారన్నారు. సరిగ్గా చదవుకోవడం లేదని మందలించిన క్రమంలో ఇలా చేసి ఉంటారని తల్లిదండ్రులు చెబుతున్నారు.

రేపు లోన్ మెగా మేళా

అనంతపురం అర్బన్: బ్యాంక్ లోన్ మెగా మేళా ఈనెల 13న కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించనున్నట్లు ఎల్‌డీఎం నర్సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఉదయం 10 గంటలకు లోన్ మేళాను ప్రారంభిస్తారన్నారు. అన్ని బ్యాంకుల అధికారులు, డీఐసీ, చేనేత, ఉద్యానశాఖ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. స్టాండప్ ఇండియా పథకం, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ), చేనేత ముద్ర స్కీమ్, ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి రుణవితరణ ఎలా పొందాలి? రుణం మంజూరుకు కావాల్సిన పత్రాల జాబితా? తదితర వివరాలు తెలియజేస్తారన్నారు.

రూపాయికో పట్టా..



- జిరాక్స్ కాపీ ఖర్చుతో దొంగ పట్టాల తయారీ
- అక్రమార్కుల నయా దందా
- అనంతపురం రూరల్ మండలంలో వేలాది నకిలీ పట్టాలు
- అవసరాన్ని బట్టి ఒక్కో పట్టాకు రూ.20 వేల నుంచి 50 వేల దాకా వసూలు
- ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా మౌనం వహిస్తున్న పోలీసులు



నగర శివారులోని ఓ కాలనీకి చెందిన ఆర్.చెన్నమ్మకు కొందరు ఇంటి పట్టా ఇప్పిస్తామంటూ నమ్మించి రూ.15 వేల దాకా డబ్బులు తీసుకున్నారు. ఉప్పరపల్లి పొలం 194–8 సర్వే నంబర్‌లో సెంటున్నర స్థలం కేటాయించి పట్టా కూడా ఇచ్చారు. ఇది నిజమైన పట్టా అనుకుని చెన్నమ్మ భ్రమలో ఉండేది. ఇటీవల ఈ పట్టాను పరిశీలించిన రెవెన్యూ అధికారులు.. అది నకిలీ పట్టా అని ధ్రువీకరించారు. తమ రికార్డుల్లో ఈ సర్వే నంబర్‌లో ఎవరికీ ఇంటి పట్టాలు ఇవ్వదేదని తేల్చి చెప్పారు. పైగా నకిలీ పట్టాలో ఉన్న తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేశారని తెలిపారు. సీల్ కూడా కార్యాలయానికి సంబంధించినది కాదని స్పష్టం చేశారు.

రాప్తాడు రూరల్: జిరాక్స్ కేంద్రంలో ఒక పేపర్ జిరాక్స్ చేయించాలంటే రూపాయి ఖర్చు. అనంతపురం రూరల్ మండలంలో వివిధ కాలనీల్లో పట్టా కావాలంటే అయ్యే ఖర్చు రూపాయే. అలా జిరాక్స్ సెంటర్‌లోకి వెళ్లి ఖాళీ పట్టా జిరాక్స్ చేయించి అందులో వివరాలు నమోదు చేసి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేస్తారు. తహసీల్దార్ కార్యాలయం సీలు కూడా వారివద్దే సిద్ధంగా ఉంటుంది. ఆ సీలుముద్ర వేసి పట్టా తయారు చేస్తారు. ఈ నకిలీ పట్టా ఖరీదు మార్కెట్‌లో అవసరాన్ని బట్టి రూ.20 వేలు నుంచి రూ.50 వేల దాకా ఉంటుంది. అసలు విషయం తెలియని అమాయక పేద ప్రజలు కూలినాలి చేసి సంపాదించిన సొమ్మంతా ఖర్చు పెట్టుకుంటున్నారు. పట్టాలు తీసుకుని రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్తున్న బాధితులు.. అసలు విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు.

అనంతపురం రూరల్ మండలం నకిలీ పట్టాల తయారీకి గత టీడీపీ హయాంలో బీజం పడింది. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో ఓ తహసీల్దార్ దాదాపు రెండున్నరేళ్లు పని చేశారు. ఆయన వెళ్లినప్పటి నుంచి ఫేక్ పట్టాలు పుట్టుకొచ్చాయి. నేటికీ ఆయన పేరుమీద నకిలీ పట్టాలు పుట్టిస్తూనే ఉన్నారు. ఈ ఒక్క తహసీల్దార్ పేరుమీద సుమారు 6 నుంచి 8 వేల నకిలీ పట్టాలు సృష్టించారు. ఉప్పరపల్లి, సోములదొడ్డి, రాచానపల్లి, కురుకుంట, కొడిమి, చిన్నంపల్లి, కక్కలపల్లి కాలనీ పంచాయతీల్లో అధికంగా నకిలీ పట్టాలు కనిపిస్తున్నాయి. ప్రజాసంఘాలు, కుల సంఘాల పేరుతో సాగించిన ఈ దందా కోట్ల రూపాయల్లో సాగింది. ఈ నకిలీ పట్టాల ఆధారంగానే కొందరు ఆయా స్థలాలను ఆక్రమించుకున్నారు. మరికొందరు నకిలీ పట్టాలను ఇళ్లల్లో భద్రంగా ఉంచుకున్నారు.

తెలిసినా పట్టించుకోరా?

నకిలీ పట్టాల విషయం వీఆర్‌ఓ మొదలుకుని ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, ఆర్డీఓ, డీఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ వరకూ అందరికీ తెలుసు. కుల సంఘాలు, ప్రజా సంఘాల ముసుగులో పేదలను నిలువునా ముంచుతున్నారనే విషయమూ తెలుసు. ప్రతిచోటా దాదాపు ఒకే బ్యాచ్ ఈ దోపిడీకి బరి తెగిస్తున్నారు. ముందుగా గుడిసెలు వేయించడం వాటికి నకిలీ పట్టాలిచ్చి కొంత నగదు దోచుకోవడం.. ఆ తర్వాత విడతల వారీగా అధికారుల పేర్లు చెబుతూ వసూలు చేస్తున్నారు. ఇప్పటి దాకా ఏ ఒక్కరిపైనా కనీస చర్యలు లేవు. చర్యలు తీసుకోవాలనే సాహసమూ చేయలేదు.

ఆటో తోలుకునే వ్యక్తి ఆధ్వర్యంలో దందా?

సమాజంలో కుల సంఘాలు, ప్రజాసంఘాల నాయకులుగా చెలామణి అవుతున్న కొందరు గుడిసెలు వేయించడం, నకిలీ పట్టాలిప్పించడమే ఉపాధిగా పెట్టుకున్నారు. ఈ దందాతోనే కొందరు కోట్లాది రూపాయలకు పడగలెత్తారు. గతంలో ఆటో తోలుకుంటూ జీవనం సాగించే ఓ వ్యక్తి ఈ నకిలీ పట్టాల తయారీకి అలవాటు పడి చేతినిండా డబ్బులు సంపాదిస్తున్నాడు. కొన్నేళ్లుగా ఆటోను పూర్తిగా పక్కన పెట్టేసి ఇదే పనిలో నిమగ్నమయ్యాడు. అక్రమార్కులను నమ్ముకుని పట్టాకింత డబ్బు ఇచ్చిన నిరుపేదలు మరింత అప్పుల ఊబిలోకి వెళ్తున్నారు.

కనీస చర్యలు శూన్యం..

ఇటీవల నకిలీ పట్టాలు సృష్టించేవారిపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. స్వయంగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పరిశీలించి.. క్రిమినల్ కేసు నమోదుకు స్వయంగా అనంతపురం డీఎస్పీని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా జాయింట్ కలెక్టర్ ద్వారా ఎస్పీకి లేఖ రాయించారు. ఫోన్ చేయించారు. ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ స్పందించారు. తహసీల్దార్‌తో ఫిర్యాదు తీసుకున్నారు. నకిలీ పట్టాలు సృష్టిస్తున్న కొందరి పేర్లను ఆధారాలతో తెలిపారు. ఫిర్యాదు చేసి నెల రోజులవుతున్నా నేటికీ చర్యలు లేవు. పోలీసులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోందని బాధితులు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం



అనంతపురం రూరల్ మండల పరిధిలోని వివిధ పంచాయతీల్లో నకిలీ పట్టాల దందా సాగించారు. మా కార్యాలయానికి ఏమాత్రం సంబంధం లేదు. తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేశారు. చివరకు కార్యాలయం సీలు కూడా నకిలీది చేయించారు. వాటి ఆధారంగా దొంగ పట్టాలు సృష్టించి పేదల నుంచి వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. పేద ప్రజలూ ఎవరూ మోసపోవద్దు. ఎవరైనా పట్టా ఇప్పిస్తామని చెబితే ముందుగా కార్యాలయంలో సంప్రదించి నివృత్తి చేసుకోండి. నకిలీ పట్టాలిచ్చిన వారిపై ఫిర్యాదు చేస్తే పోలీసు స్టేషన్‌లో కేసులు పెడతాం.

– మోహన్ కుమార్
తహసీల్దార్, అనంతపురం

పెట్టుబడి సాయం అందించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు, రైతులు

రాప్తాడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ పి.విజయకుమారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. అధికారంలో వచ్చిన తర్వాత రైతులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నీల వెంకటరాముడు, నాయకులు ఎం.వెంకట్రాముడు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇంత వరకూ పంట సాయం అందించలేదని గుర్తు చేశారు. ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిచారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివ, రామాంజనేయులు పాల్గొన్నారు.

‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’కు డుమ్మా



ప్రజా పరిష్కార వేదికకు హాజరైన మూడు శాఖల అధికారులు

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక తూతూమంత్రంగా సాగింది. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ పి.విజయ కుమారి ఆదేశాలు జారీ చేసినా.. మండల స్థాయి అధికారులు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. తహసీల్దార్ పి.విజయ కుమారి, ఏపీఎం సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు తప్పక పాల్గొని ప్రజా సమస్యలను తక్షణ పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే అధికారులు యథేచ్ఛగా డుమ్మా కొడుతున్నారు. చాలా మంది అధికారుల గైర్హాజరుతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. డుమ్మా కొట్టే అధికారులను అడిగేవారు లేకపోవడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అభాసుపాలవుతోంది. వచ్చే రెండు మూడు శాఖల అధికారులు కూడా ఎక్కువ సేపు సెల్‌ఫోన్లలో మాట్లాడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి



జిల్లా పోలీస్ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ పి.జగదీష్



ఎస్కేయూలో పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ రమేష్ బాబు, తదితరులు

అనంతపురం: దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు ఆదర్శనీయం. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర సమరయోధుడిగా, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశిష్ట సేవలు అందించారన్నారు. విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జేఎన్‌టీయూ అనంతపురంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి జరిగింది. దేశానికి కలాం చేసిన సేవలను రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు కొనియాడారు.

ఇతర విభాగాల పనులు కేటాయించొద్దు



తహసీల్దార్ పి.విజయ కుమారికి వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

రాప్తాడు: ఇతర విభాగాలకు సంబంధించిన పనులను తమకు కేటాయించ వద్దని వీఆర్వోలు కోరారు. సోమవారం తహసీల్దార్ పి.విజయ కుమారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ.. మండలంలో తమ విధులతో పాటు ప్రస్తుతం గ్రామ స్థాయిలో జరగబోయే సాగునీటి సంఘం ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితా తయారీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, సాధారణ ఓటర్ జాబితా ఇంటింటా సర్వే చేయడం, సెలవు దినాల్లో కూడా ఓటర్ నమోదుపై క్యాంపులు పెట్టడం సరికాదన్నారు. బీఎల్వోల విధులు కేటాయించడంతో పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పింఛన్లు పంపిణీకి 1వ తేదీన 5 గంటలకే డ్యూటీలు వేయడం సరికాదన్నారు. ఇక రెవెన్యూ విధుల్లో భాగంగా కోర్టు వాయిదాలు, నీటి తరువా డిమాండ్ తయారు చేయుట తదితర పనులు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితోనే అనేక ఇబ్బందులు పడుతుంటే ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే కోసం తమను భాగస్వామ్యం చేస్తున్నారని మండిపడ్డారు. సచివాలయాల్లో ప్రత్యేక కంప్యూటర్, స్టేషనరీ కూడా లేకపోవడంతో మా సొంత డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. అదేవిధంగా పంచాయతీకి సంబంధించి ఇతరత్రా విధులు, ఇంటి పన్నులు వసూలు చేయాలంటూ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు లక్ష్మీనారాయణ చౌదరి, రవి కిరణ్, మనోజ్ సాయి, ఖుర్దూస్, సరస్వతి, గీతా రాణి, శిరిష తదితరులు పాల్గొన్నారు.

కార్తీకం.. దేదీప్యం



అలంకరణలో మంజునాథుడు



చిన్మయనగర్ శివాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



అనంతపురం మొదటి రోడ్డు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్/రాప్తాడు: ఓం నమఃశివాయ అంటూ భక్తుల నామస్మరణతో అనంత మార్మోగింది. కార్తీక మాసంలో వచ్చిన రెండవ సోమవారం శైవక్షేత్రాలు భక్తజన సందోహంతో శోభాయమానంగా మారాయి. అనంతపురంలో బసవన్నకట్ట, పాతూరు విరూపాక్షేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయం, శివబాలయోగి ఆశ్రమం, సర్వేశ్వరాలయం, శివకోటి, హెచ్చెల్సీ కాలనీ ముత్యాలమ్మ ఆలయం తదితర చోట్ల మహాశివుడు ఏకవార రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, అష్టోత్తరశతనామ పూజలందుకున్నాడు. మొదటి రోడ్డు శివాలయం వద్ద జన జాతర తలపిస్తూ ప్రత్యేక దీపోత్సవాలు జరిగాయి.పలుచోట్ల కార్తీకనోములు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శ్రీశృంగేరీ శారదా శంకరమఠంలో జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం కోలార్ పీఠాధిపతులు అద్వైతానంద భారతీ స్వామీజీ ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులతో చంద్రమౌళీశ్వర పూజలు జరిపించారు. కార్తీక వైభవ విశిష్టత తెలియజేశారు. నిర్వాహకులు సత్యప్రసాద్, మోహనరావు మాట్లాడుతూ.. స్వామీజీ మంగళవారం ఉదయం పాదపూజలు, భిక్షావందనంలో పాల్గొంటారని తెలిపారు. రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో వెలసిన శ్రీగౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ సమీపంలోని పార్వతీ దేవి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రాజుల తిమ్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రెనాటి కొండారెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి మహానంది రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, మహా మంగళ హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.



అలంకార సేవలో పరమేశ్వరుడు



దీపారాధన చేస్తున్న మహిళలు



అలంకరణలో గౌరీ ప్రసన్నేశ్వర స్వామి

కుల వృత్తిని అవమానిస్తే ఊరుకోం

అనంతపురం కార్పొరేషన్: కులవృత్తిని అవమానిస్తే ఊరుకునేది లేదని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప టీడీపీకి చెందిన జిలాన్ బాషా అనే వ్యక్తి నాయీ బ్రాహ్మణులపై అనుచితంగా మాట్లాడటం సరికాదన్నారు. తక్షణం ఆ మాటలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

క్లుప్తంగా

ట్రూ అప్ చార్జీలతో భారం మోపుతారా?



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సీపీఎం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రుద్రంపేట నుంచి రాంనగర్ సర్కిల్ వరకు ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శివర్గ సభ్యులు ముర్తుజా, ఇర్ఫాన్, గోపాల్ మాట్లాడారు. మహిళలు, అమ్మాయిలు, దళితులపై దాడులు పెరిగాయన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూ అప్ చార్జీ పేరుతో ప్రజలపై వేలకోట్ల రూపాయల భారం మోపేందుకు సిద్ధపడిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకుల ఏటీఎం నాగరాజు, ఆదినారాయణ, లతీఫ్‌గౌస్, ఆజాం, గఫూర్, లింగారెడ్డి, ఆదినారాయణ, శ్రీనివాసులు, ఆదెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దన్న పోరాటాలు స్ఫూర్తిదాయకం



పెద్దన్న స్థూప నిర్మాణంలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

అనంతపురం అర్బన్: సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శిగా ప్రజాసమస్యలపై సి.పెద్దన్న చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌బండా అన్నారు. సోమవారం స్థానిక రజక్‌నగర్‌లో పెద్దన్న స్థూప నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్దన్న తుదిశ్వాస వరకు అలుపెరగని పోరాటాలు సాగించారన్నారు. ముఖ్యంగా పేద వర్గాల హక్కుల సాధనకు ఉద్యమించారన్నారు. ఆయన ఆశయ సాధన లక్ష్యంగా పోరాటాలు సాగించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ రైతు కూలీ, స్త్రీ విముక్తి సంఘటన, సీపీఐఎంఎల్ నాయకులు, కార్మికులు, హమాలీలు, రజకనగర్, స్టాలిన్ నగర్, ఎంఎస్ నగర్, తదతర కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

డ్రాయింగ్ ఉపాధ్యాయుడికి విశిష్ట గౌరవం



ఉపాధ్యాయుడు శ్రీరాములును సత్కరిస్తున్న గౌరవ అతిథులు

రామగిరి: మండలంలోని పేరూరు డ్యాంలో ఉన్న ఏపీఆర్ఎస్ (బీసీ, బాలుర) పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న డ్రాయింగ్ టీచర్ శ్రీరాములుకు ఆర్ట్‌ఆఫ్‌ఏపీ పుస్తకంలో చోటు దక్కింది. ఇటీవల విజయవాడలోని ఏపీ టూరిజం హరితబేరం పార్కులో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విజయవాడకు చెందిన అంతర్జాల పత్రిక 64 కళల డాట్ కామ్ వ్యవస్థాపకుడు కళాసాగర్.. 300 మంది ప్రతిభావంతులైన చిత్రకళాకారులతో ఆర్ట్‌ఆఫ్‌ఏపీ పుస్తకాన్ని రూపొందించారు. ఇందులో డ్రాయింగ్ ఉపాధ్యాయుడు శ్రీరాములుకు చోటు దక్కింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ రాజు తదితరులు చిత్రకళాకారులను సన్మానించారు.

నేడు తులసీ దామోదర కల్యాణం

అనంతపురం కల్చరల్: పవిత్ర కార్తీకమాసంలో వచ్చే క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా సాయిట్రస్టు ఆధ్వర్యంలో తొలిసారి గోమాత, వృషభరాజ కల్యాణం, తులసీ దామోదర కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం స్థానిక వలీస్వామి ఆశ్రమంలోని కొల్హాపురి మహాలక్ష్మి ఆలయం వేదికగా కైసిక ద్వాదశి వేడుకలు, కల్యాణోత్సవం జరుగుతాయన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

కనగానపల్లి: గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాదులూరు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 16 రాయల్ స్ట్రీట్ విస్కీ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విక్రయిస్తున్న మాధవి అనే మహిళను అదుపులోకి తీసుకుని చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మద్యం బాటిళ్లను సీజ్‌చేసి, మహిళపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు అలీబాగ్, ఫరూక్ పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో కూలగణన తక్షణం చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ, బీహార్, తదితర రాష్ట్రాల్లో కులగణన ప్రారంభమైనట్లు గుర్తు చేశారు. 2027లో దేశవ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందన్నారు. కులగణన చేపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థానాల రిజర్వేషన్‌పై స్పష్టత వస్తుందన్నారు. అదే విధంగా కులాలు, వారి వృత్తులపరంగా పథకాలు అమలు, నిధుల కేటాయింపు చేయవచ్చని సూచించారు. ప్రజలందరికీ సమగ్ర, సమాన అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కులగణన చేపట్టడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుల సంఘాలను కలుపుకుని సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఆకట్టుకున్న ఫ్లాష్ మాబ్



డ్యాన్స్ చేస్తున్న వైద్య విద్యార్థినులు

అనంతపురం మెడికల్: ఆ కుర్చీని మడతపెట్టి.. చూపులతో గుచ్చి గుచ్చి చంపకే మేరే హాయ్.. డీజే టిల్లు, దేవరలో ఆయుధ పూజ తదితర పాటలకు వైద్య విద్యార్థులు వేసిన స్టెప్పులతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిసర ప్రాంతం దద్దరిల్లింది. విద్యార్థులు కెవ్వు కేక అన్పించేలా ఫ్లాష్‌మాబ్ నృత్య గీతిక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. 2కే24 బ్యాచ్ ఫ్రెషర్స్ డే (అనన్య) కార్యక్రమంలో భాగంగా సోమవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన ఫ్లాష్ మాబ్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికోలు, హౌస్‌సర్జన్లు, పీజీ, తదితర వైద్యులు 20 పాటలకు స్టెప్పులు వేశారు. ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ.. ఏటా ఫ్రెషర్స్ డే సందర్భంగా ఫ్లాష్ మాబ్ నిర్వహిస్తున్నట్లు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాజేష్ బాబుకు డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో పరిశోధన చేసిన డి.రాజేష్ బాబుకు సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ బి.సత్యనారాయణ పర్యవేక్షణలో ‘డిజైన్ అండ్ ఇప్లిమెంటేషన్ ఆఫ్ మల్టీ లేయర్డ్ బై డైరెక్షనల్ ఎల్ఎస్‌టీఎం నెట్‌వర్క్ మోడల్ ఫర్ స్టాక్ ప్రైస్ ప్రిడిక్షన్ బేస్ట్ ఆన్ టెక్నికల్ ఇండికేటర్ ఫీచర్స్ అండ్ ఇట్స్ ఫర్మార్మెన్స్ అనాలసిస్’ అనే అంశంపై పరిశోధన చేశారు. గుత్తికి చెందిన రాజేష్ ఎస్ఆర్ఐటీ (అటానమస్) కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.